
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 1, అక్టోబర్, 2025



సోమశిలలో 73.18 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 73.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నాకు 25,650 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,19,200
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,735
మూడు శాతం జీఎస్టీతో	రూ.11,057
నవర (8 గ్రాములు)	రూ.88,456

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.5 /25.6

జిల్లాలో అక్కడక్కడా ఆకాశం బుధవారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 57 శాతంగా మంగళవారం నమోదైంది.

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ మంగళవారం ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. స్వామి వారిని 81,626 మంది సోమవారం అర్ధరాత్రి వరకు దర్శించుకున్నారు. తలనీలాలను 25,304 మంది భక్తులు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులు మూడు గంటల్లోనే దర్శించుకోగలుగుతున్నారు.

డీసీపల్లిలో 1058 బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 1058 బేళ్లను మంగళవారం విక్రయించామని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1274 బేళ్లు రాగా, వాటిలో 1058ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 1,32,831.3 కిలోల పొగాకును విక్రయించగా.. రూ.2,96,47,128.20 వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. గరిష్ఠ ధర రూ.330.. కనిష్ఠ ధర రూ.80.. సగటు ధర రూ.223.19గా నమోదైందని వివరించారు. పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.330

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ.330 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 978 బేళ్లను తీసుకురాగా, 905ను కొనుగోలు చేయగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడారు. కనిష్ఠ ధర రూ.79.. సరాసరిన రూ.260.66గా నమోదైందన్నారు. 19 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో..

- పోలీస్ కాలనీలో దొంగతనం
- బంగారం, వెండి అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం పోలీసు కాలనీ ఐదో వీధిలో మంజులాదేవి, వెంకటేశ్వర్లు దంపతులు ఏడేళ్లుగా నివాసముంటున్నారు. ఆయన గుండెకు స్టెంట్‌ను రెండు నెలల క్రితం వేశారు. అప్పటి నుంచి తమ స్వగ్రామమైన వాకాడులో వారు ఉంటున్నారు. పది రోజుల క్రితం ఇంటికి దంపతులొచ్చి శుభ్రం చేసి వెళ్లారు. ఈ తరుణంలో ఇంటి తలుపులను గుర్తుతెలియని దుండగులు సోమవారం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాల్లోని లాకర్లలో ఉన్న 34 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులు, 150 పట్టుచీరలను అపహరించుకెళ్లారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో బాధితులకు యజమాని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇంటికి చేరుకొని పరిశీలించగా.. బంగారు, వెండి వస్తువులు, చీరలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా ఒకేషనల్ కో ఆర్డినేటర్ పరిశీలన



ఆత్మకూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష, స్కిల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఒకేషనల్ కో ఆర్డినేటర్ మల్లికార్జున మంగళవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు నేర్చుకున్న అనేక అంశాలను అడిగి తెలుసుకున్నారు. వృత్తి విద్య శిక్షకుడు గొల్లపాటి యజ్ఞా, నాగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖతర్నాక్ గ్యాంగ్‌లు

కావలి నియోజకవర్గ కేంద్రంగా ఖతర్నాక్ ముఠాలు బరితెగిస్తున్నాయి. ప్రజల అత్యాశ, బలహీనతలను ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నాయి. తక్కువ ధరకే బంగారమంటూ, నకిలీ కరెన్సీల పేరిట ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు. ఈ గ్యాంగ్‌లపై తెలుగు రాష్ట్రాల్లో కేసులున్నాయి. పలుమార్లు అరెస్టయి జైలుకెళ్లొచ్చినా వీరి తీరులో ఎలాంటి మార్పు రావడంలేదు. నేరాలకు యథేచ్ఛగా పాల్పడుతూ అందిన కాడికి దోచేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై భౌతికదాడులకు తెగబడుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే ముఠాల తరఫున కొందరు రంగంలోకి దిగి సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ఫిర్యాదులను వెనక్కి తీసుకుంటుండటంతో ఏమీ చేయలేక ఖాకీలు మిన్నకుండిపోతున్నారు. దీంతో ముఠాలు చెలరేగిపోతుండగా.. బాధితులు మోసపోతూనే ఉన్నారు.

తక్కువ ధరకే బంగారం.. నకిలీ కరెన్సీ పేరిట మోసాలు

- అమాయకుల నుంచి భారీగా కొల్లగొడుతూ..
- పలుమార్లు జైలుకెళ్లినా తీరు మారని నిందితులు
- యథేచ్ఛగా నేరాలు



సుధీర్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న గన్‌ను చూపుతున్న అప్పటి ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: కావలి పట్టణానికి చెందిన సుధీర్ తన స్నేహితులతో కలిసి గ్యాంగ్‌ను ఏర్పాటు చేశారు. మార్కెట్ ధర కన్నా తక్కువకే బంగారాన్ని ఇస్తామంటూ ముఠా సభ్యులతో పాటు తెలిసిన వారి ద్వారా ప్రచారం చేయిస్తారు. ఎవరైనా సంప్రదిస్తే ప్యూర్ బంగారు ముక్కను చూపించి నమ్మిస్తారు. దీంతో అత్యాశకు పోయి పసిడి కావాలని గ్యాంగ్‌కు నగదు ఇచ్చిన వెంటనే నకిలీ బంగారాన్ని అంటగడతారు. వారు తమ ప్రాంతాలకు తీసుకెళ్లి టెస్ట్ చేయించి నకిలీవని తేలడంతో గ్యాంగ్‌ను సంప్రదించేందుకు యత్నించినా, ప్రయోజనం ఉండదు. ఎవరైనా వస్తే వారిపై భౌతికదాడులు చేయడమే కాకుండా చంపుతామని బెదిరిస్తున్నారు. దీంతో ఏమి చేయలేక నిస్సహాయ స్థితిలో ఉండాల్సి వస్తోంది.



నకిలీ పోలీస్ గ్యాంగ్ వివరాలను వెల్లడిస్తున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు (ఫైల్)



విజయకుమార్ నేరాలను తెలియజేస్తున్న తెలంగాణ పోలీసులు (ఫైల్)

జరిగేదిలా..

బంగారం కోసం వచ్చిన వారి వద్ద టోకన్ అడ్వాన్స్ తీసుకొని పలానా రోజు.. పలానా సమయంలో తాము చెప్పిన ప్రాంతానికొస్తే అప్పజెప్తామని నమ్మబలుకుతారు. తీరా అక్కడికెళ్లాక బంగారు బ్యాగ్‌తో ఓ వ్యక్తి ఉంటారు. వారి వద్ద నగదును తీసుకొని బంగారాన్ని ఇస్తున్న సమయంలో నకిలీ పోలీసుల ముసుగులో ఉన్న ముఠా సభ్యులు ప్రత్యక్షమై పసిడితో పాటు అక్కడ ఉన్న మనిషిని అరెస్ట్ చేసి తమ వెంట తీసుకెళ్తారు. ఖాకీలను చూడగానే ఎక్కడ తమను అరెస్ట్ చేస్తారోననే భయంతో బాధితులు మిన్నకుండిపోతున్నారు. నకిలీ నోట్ల విషయంలోనూ ఇదే పంథాను అవలంబిస్తున్నారు.

భారీగా కొట్టేస్తూ..

విజయవాడకు చెందిన రాజేంద్రప్రసాద్‌కు తక్కువ ధరకే పసిడిని ఇస్తామంటూ ఈ ఏడాది జూన్‌లో రూ.7.32 కోట్లను తీసుకొని నకిలీ బంగారాన్ని అంటగట్టారు. నకిలీదని తేలడంతో వారిని బాధితుడు నిలదీయగా, కర్నూలుకు పిలిచి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కర్నూలు పోలీసులు.. నలుగురు నిందితుల నుంచి రూ.6.4 లక్షల నగదు, నాలుగు కార్లు, నకిలీ బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. సూత్రధారులైన సుధీర్‌తో పాటు ఇద్దరు పరారీలో ఉన్నారు. తక్కువ ధరకే బంగారాన్ని ఇస్తామంటూ ఒకరి వద్ద రూ.60 లక్షలు, మరొకరి వద్ద రూ.40 లక్షలను వసూలు చేసి మోసగించారు. వీరి ఆగడాలపై నెల్లూరు నవాబుపేట, కావలి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. విచారణ జరుపుతున్నారు.

నకిలీ పోలీసుల ముసుగులో..

నకిలీ పోలీసుల ముసుగులో ఓ ముఠా గతేడాది సెప్టెంబర్‌లో మోసాలకు పాల్పడింది. సులభ పద్ధతిలో నగదును సంపాదించాలనే ఉద్దేశంతో తోటపల్లిగూడూరుకు చెందిన సద్దాం హుస్సేన్, స్నేహితులతో కలిసి ఈ అవతారమెత్తారు. తక్కువ ధరకే పాలాలను ఇప్పిస్తామంటూ కొందర్ని నమ్మించారు. నగదు తీసుకొని పిడతాపోలూరులోని జెన్‌కో రోడ్డు వద్దకు రాగా, నకిలీ పోలీసుల ముసుగులో ఉన్న నిందితులు వారిపై దాడి చేసి రూ.50 లక్షలను దోచుకెళ్లారు. ఈ ఘటనలో ముఠాను అప్పట్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ నిందితుడిపై పలు కేసులున్నాయి.

అప్రమత్తత అవసరం

ఇలాంటి గ్యాంగ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అత్యాశకు పోతే మోసపోవడం తప్పదనే విషయం ఇప్పటికే అనేక ఘటనల్లో వెల్లడైంది. తక్కువ ధరకే బంగారాన్ని ఇస్తామని ఎవరైనా చెప్తే, అది మోసమని గ్రహించి పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలి. ఈ గ్యాంగ్‌లపై ఖాకీలు కఠినంగా వ్యవహరించకపోతే వీరి చేతుల్లో అనేక మంది మోసపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి ముఠాలపై జిల్లా పోలీస్ బాస్ ప్రత్యేక దృష్టి సారించి మోసాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

దాడి వ్యవహారంతో బయటకు

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై 2023, అక్టోబర్‌లో జరిగిన దాడి కేసుతో ఈ గ్యాంగ్ వ్యవహారం బయటకొచ్చింది. అప్పట్లో సుధీర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి అతని ఇంట్లోని వాకీటాకీలు, హ్యాండ్‌కఫ్స్, ఎయిర్‌గన్లు, లీడింగ్ చైన్ కత్తులు, ఫోల్డింగ్ ఐరన్ స్టిక్, జామర్స్, పెద్ద సంఖ్యలో సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, రూ.ఏడు లక్షల నగదు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసాలపై అప్పట్లో జిల్లా పోలీసులకు విజయవాడకు చెందిన ప్రవీణ్‌కుమార్, గుంటూరుకు చెందిన ప్రీతి సృజన, నరసింహులు, విజయలక్ష్మి, సుధీర్, భీమవరానికి చెందిన నారాయణదాస్, ఈపూరు వెంకన్నపాలేనికి చెందిన బాధితుడు, తెలంగాణలోని జగిత్యాలకు చెందిన రాజేష్ ఫిర్యాదు చేశారు. అప్పట్లో నిందితులపై కఠినంగా వ్యవహరించడంతో గ్యాంగ్ కార్యకలాపాలకు బ్రేక్ పడింది. అయితే తాజాగా మరోసారి నేరాలకు పాల్పడుతున్నారు.

ఇదే తరహాలో మరికొన్ని..

- కావలి పట్టణానికి చెందిన రౌడీషీటర్ విజయకుమార్ సైతం నేరాలు చేయడంలో దిట్ట. సులభ పద్ధతిలో నగదును సంపాదించాలనే ఉద్దేశంతో కొందరితో గ్యాంగ్‌ను ఏర్పాటు చేశారు. నకిలీ బంగారు బిస్కెట్లను తయారు చేసి తక్కువ ధరకే అంటూ, నకిలీ కరెన్సీ పేరిట ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడసాగారు. ఈ గ్యాంగ్‌ను తెలంగాణ పోలీసులు గతేడాది అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.51 లక్షల నగదు, రూ.ఆరు కోట్లకుపైగా నకిలీ కరెన్సీ, మూడు కార్లు, ఐదు కిలోల నకిలీ బంగారు బిస్కెట్లు, పోలీస్ యూనిఫారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాపై పలు కేసులున్నాయి.
- తాజాగా గత నెల్లో మరో గ్యాంగ్ మోసాలు జిల్లాలో వెలుగులోకి వచ్చాయి. తిరుపతికి చెందిన పైపుల వ్యాపారికి తక్కువ ధరకే బంగారాన్ని ఇప్పిస్తామంటూ నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువలోని ఓ ఇంటికి గత నెల్లో ఓ ముఠా తీసుకెళ్లింది. అక్కడ ఆయన వద్ద రూ.14.5 లక్షలను దోచుకొని దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును నెల్లూరు రూరల్ పోలీసులు నమోదు చేశారు. ముఠాలో సుమారు ఐదుగురు సభ్యులుండగా, అందులో ఓ మహిళ ఉన్నారని తెలిసింది. తక్కువ ధరకే బంగారంతో పాటు కరెన్సీ పేరిట మోసాలకు ఈ ముఠా పాల్పడుతోందనే ప్రచారం ఉంది.

తవ్వుకో.. దోచుకో..!

- సర్వేపల్లిలో ఆగని గ్రావెల్ దందా
- పట్టించుకోని అధికారులు



పలుకూరువారిపాళెం చెరువులో యంత్రంతో గ్రావెల్ తవ్వకాలు

వెంకటాచలం: మండలంలో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ రవాణాపై సోషల్ మీడియా, పత్రికల్లో నిత్యం కథనాలు ప్రచురితమవుతున్నా, అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని సర్వేపల్లి, గుడ్లూరువారిపాళెం, కాకుటూరు, వెంకటాచలం, గొలగమూడి, రామదాసుకండ్రిగ గ్రామాల్లో గల చెరువుల్లో గ్రావెల్‌ను జేసీబీలతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. తాజాగా ఇడిమేపల్లి, పలుకూరువారిపాళెంలోని చెరువుల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా గ్రావెల్‌ను తవ్వుతున్నారు. దీన్ని మనుబోలు మండలం కాగితాలపూరు సమీపంలోని రొయ్యల గుంటల వద్దకు తరలిస్తున్నారు.

అధికారుల మొద్దు నిద్ర

చెరువుల్లో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి దోపిడీకి కూటమి నేతలు పాల్పడుతున్నా, అధికారులు మొద్దు నిద్రను వీడటంలేదు. సామాన్యులెక్కడైనా ట్రాక్టర్ మట్టి తోలుతుంటే వెంటనే వాలిపోయే వీరు.. గ్రావెల్ వ్యవహారాన్ని పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడంలేదని ఇడిమేపల్లి, పలుకూరువారిపాళెం గ్రామాల రైతులు మండిపడుతున్నారు. గ్రావెల్ గుంతల్లో పడి చిన్నారులు మృతి చెందుతున్నా, అధికారులు ఎందుకు అడ్డుకట్ట వేయడంలేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరుతున్నారు.



ఇడిమేపల్లి చెరువులో ఇలా..

రెండో రోజూ కొనసాగిన వైద్యుల సమ్మె

నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న రెగ్యులర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మంగళవారంతో రెండో రోజుకు చేరింది. జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో ఓపీ సేవలను వైద్యులు బంద్ చేశారు. దీంతో అక్కడికొచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కొన్నిచోట్ల వచ్చిన వారికి నర్సులే ఏవో వారికి తోచిన నాలుగు మాత్రలిచ్చి పంపుతున్నారు. దీంతో రోగుల అవస్థలు వర్ణనాతీతమయ్యాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా.. డీఎంహెచ్‌ఓ సుజాతతో పాటు కొంతమంది డాక్టర్లను పిలిపించి సమ్మె చేసేందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. అయినా డాక్టర్లు సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు వీలవ్వలేదు.

ఇన్ సర్వీస్ కోటాను పునరుద్ధరించాలి

ఇన్ సర్వీస్ కోటాను తక్షణమే పునరుద్ధరించాలని ప్రభుత్వ వైద్యుల సంఘ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. 25 ఏళ్లుగా డాక్టర్లుగా పనిచేస్తున్నా, ఎలాంటి ఉద్యోగోన్నతుల్లేకుండా ఒకే కేడర్‌లో కొనసాగాల్సి రావడం బాధాకరమన్నారు. టైమ్ బౌండ్ ఉద్యోగోన్నతులను కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేసేంత వరకు సమ్మెను విరమించేదిలేదని స్పష్టం చేశారు.

ధర్నా నేడు

సమ్మెలో భాగంగా జిల్లా వైద్య శాఖ కార్యాలయం వద్ద ధర్నాను డాక్టర్లు బుధవారం చేపట్టనున్నారు. డిమాండ్లను అంగీకరించేంత వరకు నిత్యం ఏదో ఒక ఆందోళనను చేపడతామని వారు స్పష్టం చేశారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ తగదు

- పేదలకు దూరం చేసేందుకే కుట్ర
- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను విక్రయించి సొమ్ము చేసుకోవడమే చంద్రబాబు లక్ష్యం
- దీన్ని అడ్డుకొని తీరుతాం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన

సాక్షిప్రతినిధి, నెల్లూరు: పేదలు.. బడుగు, బలహీన వర్గాలకు వైద్య విద్యను దూరం చేసేందుకు సీఎం చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే యత్నాన్ని నిరసిస్తూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులు, పేదలు నిరసనను మంగళవారం చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి ఎస్సీ సెల్ నేతలతో కలిసి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తలు ఆనం విజయకుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్ పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఒక్క కళాశాలనైనా తీసుకొచ్చారా..?

విద్య, వైద్యమనేది అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కు అని కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు తన హయాంలో రాష్ట్రంలో ఒక్క మెడికల్ కళాశాలనైనా.. ఒక్క సీటైనా అదనంగా తీసుకురాలేదని గుర్తుచేశారు. గతంలో కోవిడ్ మహమ్మారి సమయంలో ధనవంతులు సైతం సరైన వైద్యాన్ని అందుకోలేకపోయారని చెప్పారు. ప్రభుత్వ వైద్యులే చికిత్స చేసి పలువురి ప్రాణాలను కాపాడిన అంశాన్ని ప్రస్తావించారు.



నిరసనకు భారీగా హాజరైన పార్టీ శ్రేణులు

జవాబు చెప్పలేక పలాయనం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అంశమై శాసన మండలిలో ప్రభుత్వాన్ని తాను నిలదీస్తే, జవాబు చెప్పలేక పలాయనం చిత్తగించారని మేరిగ మురళీధర్ విమర్శించారు. అధికార, ధనబలంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే వేధిస్తున్నారని.. అధికారం శాశ్వతం కాదనే అంశాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఇబ్బంది పెట్టే వారి పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో బుద్ధి చెప్పి.. కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బుద్ధి మార్చుకోండి..

పిల్లలు ఉన్నత చదువులను అభ్యసిస్తే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని గ్రహించిన జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పేరుతో పాఠశాలలు, వైద్య విద్యను బలోపేతం చేశారని ఆనం విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. పేదలకు వైద్య విద్యను దూరం చేసే యత్నాలను మానుకోకపోతే చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్తామని స్పష్టం చేశారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఏడు మెడికల్ కళాశాలలను ఒకే సంవత్సరంలో జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే పది కాలేజీలను కంప్లీట్ చేయాలంటే 23 ఏళ్లు పడుతుందని చంద్రబాబు పేర్కొనడం, ఆయన చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు.

జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాశయం

పరిస్థితిని స్వయంగా గమనించిన నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ వైద్యమందాలని.. పేదలు డాక్టర్లవ్వాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించారని కాకాణి చెప్పారు. వీటిలో ఐదింట్లో అడ్మిషన్లు జరగ్గా, మరో ఐదు పూర్తయ్యాయన్నారు. మిగిలిన చోట్ల పనులు జరుగుతుండగా, అధికారం మారడంతో సీఎంగా చంద్రబాబు పగ్గాలు చేపట్టాక పదింటిని ప్రైవేటీకరిస్తానని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. వీటిని విక్రయించి సొమ్ము చేసుకోవడమే ఆయన లక్ష్యమని ఆరోపించారు. గతంలో మెడికల్ సీట్లు 2360 ఉండేవని, అయితే జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ఇవి 4910కు పెరిగాయని పేర్కొన్నారు. కళాశాలలు పూర్తయితే మరిన్ని సీట్లొచ్చే అవకాశం ఉందని, ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్ తదితరులు

ప్రజలు క్షమించరు

మెడికల్ కళాశాలలను తాము నడపలేమని, సీట్లు వద్దంటూ కేంద్రానికి లేఖను చంద్రబాబు రాయడాన్ని ప్రజలు క్షమించరని కామరాజు పేర్కొన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు బద్దెపూడి రవీంద్ర, స్వర్ణా వెంకయ్య, మందా రవికుమార్, ఎస్సీ సెల్ ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడు ఒంగోలు రాఘవేంద్ర, నవకోటి, రాహుల్‌గాంధీ, రాజేష్‌కుమార్, పాముల శ్రీనివాసులు, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి యిర్మియా, నేతలు మొయిళ్ల గౌరి, తనూజరెడ్డి, ఖలీల్ అహ్మద్, వెంకటశేషయ్య, బొబ్బల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తూ..

వైభవం.. అమ్మవారి ఉత్సవం

జిల్లాలో శరన్నరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో, కన్యకాపరమేశ్వరి ఆలయంలో, మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో, జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో అమ్మవారు దుర్గా అలంకరణలో దర్శనమిచ్చారు. ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో లలితాపరమేశ్వరిగా అలంకరించారు. పెంచలకోనలో అమ్మవారు రాజ్యలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

- సాక్షి నెట్‌వర్క్


నెల్లూరు : దుర్గా అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు


మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో..


కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో లలితా పరమేశ్వరి అలంకారం


జొన్నవాడలో దుర్గాదేవి అలంకారంలో కామాక్షితాయి


పెంచలకోనలో రాజ్యలక్ష్మి అలంకరణలో..

సర్వే రిపోర్ట్ మాయాజాలం

- కొన్ని రిజిస్ట్రేషన్లకు సబ్మిట్ చేయడం తప్పనిసరి
- నకిలీవి సృష్టిస్తున్న కేటుగాళ్లు
- ఓ కార్యాలయంలో ఇచ్చినట్లు వెలుగులోకి..

నెల్లూరు సిటీ: కేటుగాళ్లు నకిలీ సర్వే రిపోర్ట్‌లను సృష్టించి జేబులు నింపుకొంటున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పదుల సంఖ్యలో సృష్టించి క్రయదారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. నెల్లూరు ఆర్‌ఓ, స్టోన్‌హౌస్‌పేట, బుజబుజ నెల్లూరు, కందుకూరు, అల్లూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, కావలి, కోవూరు, ముత్తుకూరు, పొదలకూరు, రాపూరు, ఉదయగిరి, వింజమూరులో ఉన్నాయి. వాటిల్లో కొన్ని రిజిస్ట్రేషన్లకు తప్పనిసరిగా సర్వే రిపోర్ట్‌ను సబ్మిట్ చేయాలి. గతంలో ప్రభుత్వ, ప్రైవేట్ సర్వేయర్లు ఇచ్చేది సరిపోయేది. అయితే ప్రస్తుతం ప్రభుత్వ సర్వేయర్లు ఇచ్చే దానిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రభుత్వ, కాలువల పక్కనుండే స్థలాలు, సర్వే నంబర్లు భిన్నాలు అయినప్పుడు పలు కారణాలతో సర్వే రిపోర్టును క్రయదారులు పొందుతారు. సర్వేయర్ ఇచ్చిన రిపోర్ట్‌ను పరిశీలించి సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేస్తారు.



ప్రభుత్వ సర్వేయర్ పేరుతో ఇచ్చిన నకిలీ రిపోర్ట్

నకిలీ కలకలం

జిల్లాలో మండల, డిప్యూటీ సర్వేయర్లు కలిపి 80 మంది వరకు ఉన్నారు. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి డాక్యుమెంట్ సర్వే నంబర్ల ప్రకారం స్థలం హద్దులు సరిగ్గా ఉన్నాయని నిర్ధారించి రిపోర్టు ఇస్తారు. కాగా బుజబుజనెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ సర్వే రిపోర్ట్‌ల వ్యవహారం కలకలం రేపింది. దీనిని గుర్తించిన ఆ సబ్ రిజిస్ట్రార్ సర్వేయర్‌కు ఫోన్ చేసి ఇది మీరు ఇచ్చిందేనా అని ప్రశ్నిస్తే.. తాను ఇవ్వలేదని, సంతకం ఫోర్జరీ చేశారని చెప్పడం గమనార్హం. నకిలీదిగా గుర్తించి రిజిస్ట్రేషన్‌ను నిలిపివేశారు. కాగా పదుల సంఖ్యలో నకిలీ సర్వే రిపోర్ట్‌లను కొందరు కేటుగాళ్లు సృష్టించి జిల్లా వ్యాప్తంగా దొంగ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని తెలిసింది.

రూ.10 వేలిస్తే..

ఈ స్థలం తమదేనని ప్రభుత్వం ద్వారా నిర్ధారించేందుకు యజమాని చలానా కట్టాలి. సర్వేయర్లు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి రిపోర్ట్‌ను సిద్ధం చేస్తారు. అయితే కొందరు రిపోర్ట్ ఇవ్వాలంటే రూ.10 వేలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కేటుగాళ్లు నకిలీవి సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. పలువురు ప్రభుత్వ సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు థర్డ్ పార్టీగా బంధువులను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

చెముడుగుంటలో వ్యక్తి దారుణ హత్య


మల్లికార్జున మృతదేహం

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట పంచాయతీ నక్కల కాలనీకి వెళ్లే మార్గంలో బుజబుజ నెల్లూరు పరిధిలోని న్యూకాలనీకి చెందిన వల్లూరు మల్లికార్జున (55) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. న్యూకాలనీలో నివాసముంటున్న మల్లికార్జున సోమవారం రాత్రి 7 గంటల నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఎక్కడికి వెళ్లాడో తెలియలేదు. మంగళవారం సాయంత్రం చెముడుగుంట పంచాయతీ పరిధిలో నక్కల కాలనీకి వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు విచారించగా ఆ మృతదేహం మల్లికార్జునదిగా తేలింది. అతడిని గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో కొట్టి హత్య చేసినట్లుగా తెలుస్తోంది. ఒంటిపై ఉన్న బంగారు నగల కోసం హత్య చేశారా?, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? తదితర అంశాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మల్లికార్జున చనిపోయాడని సమాచారం తెలియడంతో అతని భార్య వనమ్మ, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం వేలుముద్రలు సేకరించింది. కాగా మృతదేహం ఉన్న ప్రాంతానికి మీడియా ప్రతినిధులను పోలీసులు అనుమతించలేదు. ఫొటోలు తీయొద్దని చెప్పడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బంగారం, వెండి చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు ఎఫ్‌సీఐ కాలనీ సమీపంలోని కృష్ణానగర్‌లో వెంకట వరప్రసాద్ కుటుంబం నివాసం ఉంటోంది. అతను వేదాయపాళెం నారాయణ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలోని సుమారు తొమ్మిది సవర్ల బంగారు ఆభరణాలు, పూజగదిలోని 1/4 కేజీల వెండి వస్తువులు అపహరించారు. మంగళవారం ఇంటికి వచ్చిన బాధితులు చోరీ ఘటనపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఇంటికెళ్తుండగా..

- వివాహిత గొలుసు చోరీ

నెల్లూరు(క్రైమ్): గుడి నుంచి భర్త, కుమార్తెతో కలిసి మోటార్‌బైక్‌పై వెళ్తున్న వివాహిత మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లిన ఘటన నెల్లూరు రాంజీనగర్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన లక్ష్మి, అశోక్‌రెడ్డి దంపతులు సోమవారం రాత్రి కుమార్తెను తీసుకుని రాజరాజేశ్వరి ఆలయానికి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని అర్ధరాత్రి వారు బైక్‌పై ఇంటికి బయలుదేరారు. రాంజీనగర్ వద్దకు వచ్చేసరికి వర్షం కురుస్తుండటంతో ఓ దుకాణం వద్ద ఆగారు. కాసేపటికి వాన తగ్గడంతో బయలుదేరారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు వెంబడించి లక్ష్మి మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న బాధితులు తేరుకుని దుండగులను వెంబడించే ప్రయత్నం చేశారు. వారు పరారయ్యారు. మంగళవారం బాధితులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సర్వేపల్లి రిజర్వాయర్‌లో కొండచిలువలు

- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు


సర్వేపల్లి రిజర్వాయర్

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్‌లో కొన్నిరోజులుగా కొండచిలువలు తిరుగుతున్నాయని చేపల వేటకు వెళ్లే గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల జలాశయం నుంచి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసిన సమయంలో ఇవి వచ్చాయని కొన్నిరోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. పదిరోజుల క్రితం తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలోని మంగళంపాడు గిరిజన కాలనీకి చెందిన మత్స్యకారులు రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లగా చనిపోయిన పాము వలకు చిక్కింది. దాన్ని బయటకు తీసుకొచ్చి పడేశారు. తిక్కవరప్పాడు బ్రాంచ్ కాలువలో నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతున్న పొడవైన కొండచిలువను ప్రయాణికులు చూసి భయాందోళనకు గురయ్యారు. ఆదివారం అనికేపల్లి సమీపంలో సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట అంచున చెట్ల వద్ద పాము ఉండటాన్ని చూసిన మత్స్యకారులు భయంతో పరుగులు తీశారు. రిజర్వాయర్‌లో మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ చేపల వేట కొనసాగిస్తున్నారు.

కండలేరులో 57.330 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 57.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.125
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.228
స్కిన్‌లెస్ చికెన్:	రూ.250
లేయర్ చికెన్:	రూ.187



ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనునాయక్

- జన విజ్ఞాన వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

నెల్లూరు(బృందావనం): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలి. ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలి' అని పలువురు నేతలు డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగిది. జిల్లా హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, సంస్థలకు చెందిన వారు మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు కాసులు కురిపించేలా ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాలల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. పీపీపీ విధానం ద్వారా ప్రజలకు ఆరోగ్యం, పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరంచేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సంస్థలు ప్రజలను ఏ విధంగా కాపాడాయో వెల్లడించారు. ప్రజలకు అవగాహన కలిగించి వారిని చైతన్యపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో నాయకులు బుజ్జయ్య, గాలి శీనయ్య, నారాయణ, డాక్టర్ ఖాదర్‌బాషా, డాక్టర్ ఎండీ షఫీ, ఎంవీ చలపతి, ఎ.విజయకుమార్, విద్యాచరణ్, కృష్ణ, ఎస్.శంకరయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై.. పనికెళ్లకుండా..

- దంపతుల మధ్య విభేదాలు
- భర్త ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో షేక్ మున్నా (22), తస్లీమ్ దంపతులు నివాసముంటున్నారు. అతను వెల్డింగ్ పనులు చేసుకుంటూ భార్య, తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన మున్నా పనికెళ్లకుండా తిరగసాగాడు. దీంతో దంపతుల నడుమ విభేదాలు నెలకొన్నాయి. పదిరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. సోమవారం రాత్రి మున్నా ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈక్రమంలో సీలింగ్‌కు ఉన్న పైపునకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా మున్నా మృతిచెంది ఉన్నాడు. బాధిత తండ్రి చాన్ బాషా నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.35
సన్నవి :	రూ.20
పండ్లు :	రూ.10



రేపు ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి తుడా: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం స్విమ్స్ ఆస్పత్రి ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటించడం జరిగిందని డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర విభాగం సేవలు యథావిధిగా కొనసాగుతాయని, రోగులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దివ్యరూపం.. మహాతేజం




చంద్రప్రభ వాహనంపై కృష్ణుని అలంకరణలో మలయప్ప స్వామి

- ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ సేవలో శ్రీనివాసుడి కటాక్షం
- తిరుమంజనంలో సేదతీరిన శ్రీవారు
- నేడు రథోత్సవం, రాత్రి అశ్వవాహనం
- రేపటి చక్రస్నానంతోముగియనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన కాంతుల్లో మలయప్పస్వామి దేదీప్యమానంగా భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఉదయం సూర్యకాంతుల మధ్య స్వర్ణకాంతులీనుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో బ్రహ్మోత్సవాల్లో మూడో స్నపన తిరు మంజనంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు సేద తీరారు. సాయంత్ర వేళలో ఆలయం వెలుపల సహస్ర దీపాలంకరణ సేవలో స్వామి ఊయలూగుతూ దర్శనమిచ్చారు. ఆ తర్వాత రాత్రి నిర్వహించిన చంద్రప్రభ వాహనసేవలో దివ్య మంగళరూపంలో దర్శనమిచ్చారు. ఏడో రోజు వాహన సేవల్లో కళాకారులు, వివిధ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో కళాకారులు అభినయం భక్తులను ఆకట్టుకుంది. ఆలయంతోపాటు ఫల, పుష్ప ప్రదర్శన శాలలోని పుష్ప, విద్యుత్ అలంకరణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక నాదనీరాజనం, ఆస్థాన మండపంలో కళాకారులు భక్తి, సంగీత కార్యక్రమాలు అలరించాయి. పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.


కళాకారుల ప్రదర్శన

రథోత్సవానికి సర్వం సిద్ధం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం శ్రీవారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 7.00 గంటల నుంచి ఆలయ మాడ వీధుల్లో స్వామివారు విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

చక్రస్నానం కోసం పుష్కరిణిలో ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు గురువారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. వైదికంగా నిర్వహించే ఈ కార్యక్రమం నిర్వహణ కోసం టీటీడీ పుష్కరిణిలో భారీ ఏర్పాట్లు చేసింది. భక్తులను ఉదయం 4 గంటల నుంచి పుష్కరిణిలోకి అనుమతిస్తారు. భక్తులు రోజంతా పుణ్యస్నానాలు చేయవచ్చని ఆలయ అర్చకులు, అధికారులు తెలిపారు.